# నారయ్య బతుకు

## గూడూరి సీతారాం

తొలితరం తెలంగాణ కథకులలో ఎన్న తగినవారు గూడూరి సీతారాం. యాభయ్యవ దశకంలో తెలంగాణ వాగువంకల చప్పుళ్లను ఆవిష్కరించారు. యాసలో, ఎత్తుగడలో, కథలో నిలువెల్లా సీతారాం శైలి కనిపిస్తుంది. నగరాలు దగ్గరై నేడు పల్లెపదాలు, పదబంధాలు ఎన్నో మెరుగున పడిపోయాయి. వాటిని విప్పేవారు చెప్పేవారు కరువై నారు. "నారయ్య బతుకు" కథ 1954లో స్రవంతి మాస పత్రికలో మొదటిసారి ప్రచురితమైంది. అప్పటికే ఆయన "రాజమ్మ రాజరికం" లాంటి కథలతో కథా ప్రియులకు పరిచయస్తులు.

పొద్దు గూకస్తుంది. గౌండ్లోల్ల నారిగాడు మంచంలకెల్లి లేచి అవతలి వెుకాన పోవల్లనుకుంటున్నడు. కండ్లు మూసి తెరిసేవరకే అయిపోయింది. నారిగాని కోడలు కల్లు అంచుతుండంగ అంచుతుండగనే, చేతిలోనే ఆకును కిందపారేసి దాని కొంగువట్టి గుంజిండు కల్లు తాగెటోడు. అది లబ్బలిబ్బ మొత్తుకుంది. ఆనికి పక్కన కూసున్న యింకోడు జెట్టన లేచి దౌడమీదికెల్లి యియ్యర బయ్యర నాలుగుతికిండు.

లేచి నిలునున్న నారిగాడు అట్లనే కూలపడిపోయిండు. ఒక్కసారే కండ్లు బైర్లు కమ్మినట్లయింది.

గాచిన్నతనాన్నే నారిగానికి లగ్గమైంది. ఆని అయ్య, అవ్వ ఎప్పుడూ నారిగాని లగ్గమెప్పుడైద్దో, చూసి సల్లగా కన్ను మూయాలనుకున్నరు. ఆఖరికి అల్లు అనుకున్నట్టే, ఓ అయిందేండ్ల పోరిని దెచ్చి నారిగానికి ముడేసింద్రు. నారిగానికి యిద్దరన్నలూ, ఒక అక్కా ఉన్నరు. గప్పుడు అందరు పొత్తుల్నే ఉండెటోళ్ళు. కాని యింట్ల పడకుంట వచ్చింది. నారిగాని యిద్దరు వదినెలూ యింట్లుంటే సాలు, పొయిల ఉప్పేసుకున్నట్టే. గందుకే నారిగాని పెండ్లాం పెద్దది కాకముందే అన్నగార్లు ఏరుపడ్డరు. అప్పటికి నారిగాడు చానా సిన్నోడు. మా అంటే పదమూడు. పద్నాలుగేండ్లు ఉండొచ్చు. ఆళ్ళు ఏరువడే వరకే అయ్య చచ్చిపోయిండు. యిగ నారిగాడు తల్లిని పట్టుకొని ఉన్నడు. ఆనికి అక్క అవ్వదప్ప లోకంల దిక్కెవ్వలున్నరు? పెండ్లాముందేగాని అదీ సిన్నపోరేనాయె. మెల్ల మెల్లంగ నారిగాడు తల్లిని పట్టుకొనే పెద్దోడైండు. గానీ గప్పటికే నారిగాని అవ్వకు సాతగాకుండ అయింది. ఇగ అవ్వకే అన్ని చేసి పెట్టాల్సి వచ్చింది. గట్లకూడా కొన్ని దినాలు గడిపిండు. ఎందుకో ఏమో పెండ్లాముండంగ వండి పెట్టిండు. అవ్వకు అన్నీ అరుసుకునుడు సిన్నతనమనిపించింది నారిగానికి, గట్ల అనిపించిన్నాడే అవ్వకు జెప్పి అత్తగారింటికి వోయి పెండ్లాన్ని యెంట పెట్టుకొచ్చి యింటిపన్లన్నీ జేయించిండు.

నారిగాడు ఉడుకు నెత్తురు వట్టి ఉన్నడు. అని

**ఆణిముత్యాలు**

అన్నగాళ్లు సెరొక ఐదు తాళ్లు పట్టుకుంటే నారిగాడు వది ఒక్కడే తీసుకున్నడు. ఊర్లోల్లందరికన్నా పొద్దుగా లేచి తాళ్ళకు వొయ్యేది. జెవ్వజెవ్వన గీసి కల్లు నింపుకొని, ఈదుల్లకువొయ్యేది. అక్కడా కల్లు యిడుసుకొని అందరికన్నా ముందుగాల్నే ఊరుజేరేది. మందంతా రెండు కడువలు కావడికేసుకొని మోసుకస్తే, నారిగాడు మూడు, ఒక్కొక్కసారి నాలుగు వేసుకొని వొచ్చేది. యింటికి రాంగానే నారిగాని పెండ్లాం లసుము కల్లు అమ్మేది. ఇగ ఈడేమో యింత దిని, సుట్టేసుకొని కమ్మంగా గుర్రు పెట్టుకుంట పండుకునేది. మల్లా మూడు జాములు దాటంగానే ఓ సుట్టేసుకొని కావడి,

మోకు ఏసుకొని, ఎల్లిపోయి రాత్రి కొచ్చేటోడు. రాత్రి దెచ్చిన కల్లును గూడా లసుము సాకల్ది ఊరు దిరిగే దాకా అమ్ముకుంటూ మందికి కల్లు అంచుకుంటనే ఉండేది.

ఇప్పుడిప్పుడే నారిగాని బతుకు ఒక తొవ్వల పడ్డదని నలుగురూ అనుకుంటున్నరు. ఆనికి దగిన పెండ్లామే దొరికింది. ఏదో ఉన్నది కలో గంజో ఉడికేసి గుట్టుగా సంసారం గడుపుకొస్తుంది. నారిగానికి అవ్వపోయిన సంగునే లసుము మరపించింది. సిన్నప్పుడేమో అవ్వ - పెద్ద పెరిగినాంక నేమో పెండ్లాం ఆనికి దిక్కైంద్రు. నారిగాడు అవ్వపోయినాంక దిక్కులేని పచ్చి అయిండు. అన్నగాళ్ళేమో అంచుకన్నా రానియ్యలే! మొన్నటిదాకా జీతం చేయించుకున్న పటేలు దొంగతనం మోపి, యాపంతా మెదిగవెట్లి యింటికి లీకుమన్నడు. తాళ్ళెక్కి కల్లు గియ్యాలనుకున్నడు నారిగాడు. కాని ఆనికి తాళ్ళు ఎవలిస్తరు, ఎవలిప్పిస్తరు. అయినా చూద్దామని తెగించి ఓనాడు పొద్దుగాల్నే ముస్తాజర్ యింటికి వోయి పెద్ద సాకల్ది ఊరు తిరిగే యాల్లదాకా నిలుసొని, ఆయన్ని కలిసి అడిగిండు. కాని పాపం ఆన్ని ఎవలు అడుగుతరు, "పో! యెల్లు గాడిద నీకెవడిత్తడ్రా తాళ్ళు. రేపటాల్ల ఏదన్నజోకమైతే, కిస్తీ యాల్లకు రకం యియ్యకుంటే ఏంజేసేది. ఆరి నీకు ఊళ్లో ఎవలన్నా జమానతు ఉంటే తీసుకరా. చూద్దాం" అన్నాడు. పాపం... దిక్కు మొక్కులేని నారిగానికి జమానతు ఎవలుంటరు. ఆనికి ఉందామన్నా సక్కంగా కొంపలేదాయే - భూమి - పుట్రా అసలే లేదాయె. నగలు అయితే ఆళ్ళ యింట - వంటా నేనే లేవాయె. యిగ ఎట్లా! నారిగాడు రెండు మూడు రోజుల్దాకా సక్కంగా తిండన్నా తినలే! తిన్నా పెయిన పట్టలే! ఆఖరికి పెండ్లాన్ని బాగా జూసిండు. లసుము గప్పటికే మొగనితోని మాట్లాడుతంది. దాని పెయ్యిమీన లగ్గంల పెట్టిన కాల్లకడాలు, సెవుల పోగులు కపపడ్డయి. నారిగానికి ఏదో పోయిన పాణం లేచి వచ్చినట్లయింది. ఆ రాత్రంతా లుసుమును ఎన్నోవిధాల బురదకించిండు. పాపం దానికి మొగుడు పడుతున్న కష్టమంతా కనిపించింది. దాని పాణం కరిగిపోయంది. పెయ్యి మీదికెల్లి నవ్వుకుంటనే తీసియిచ్చింది. నారిగాడు తెల్లారే నుక్కపొడవకముందే ముస్తాజరు దగ్గరికి ఉరికిండు. తెచ్చిన నగలు కుదవ పెట్టిండు. రెండు తాళ్ళను తీసుకొన్నడు. గా రెండు తాళ్ళతోని మొదలు పెట్టిన నారిగాడు గిప్పటికి పదితాళ్ళు గీసే మొగోడైండు. ఉత్త సెవులతో కాళ్ళతో - ఉన్న లసుముకు, సెవులకు పడిగెలు కాళ్ళకూ, చేతులకు కడాలు చేయించిండు. నడుముకు బిళ్ళల ఒడ్డాణం, ఆనికేమో మోసేతికి కడెం అవీ యివీ బాగా చేయించిండు. నారిగాడు ఊళ్లోని గౌండ్లోల కొంచెం మొతబారి ఆసామి అయిండు.

గదేందో సిత్రం. కచ్చురం మంచిగ వోయినట్టే పోయిపోయి ఒక్కపారే బొందల పడేదాక తెలువదు. నారిగాడి బతుకూ గట్లనే అయింది. గానాడు నారిగాడు ఎప్పటోలనే పొద్దుగాల తాళ్ళకు వోయి కల్లు తెచ్చి తిని పడుకున్నడు. ఆనికి నిద్ర పట్టకముందే లసుమూ రూపాయి పట్వ అమ్మింది. నారిగాడు మాంచి నిద్రల ఉన్నడు. ఎవలో లేపంగనే లేసి జూపిండు. ఏముంది లబోదిబో గొట్టుకున్నడు. లసుము చచ్చిపోయింది. ఎట్ల చచ్చింది అన్నది నారిగానికి ఏమీ మనసున పట్టలే! కల్లు అమ్ముతుండగ అమ్ముతుండగనే పాణం విడిసింది. ఊళ్ళో నలుగురూ దానసొంటి సావు ఎవరికొస్తది. బంగారమసొంటి సావు. ఒగళ్ళతోటి ఏమన్న చేయించుకుండా ఏమన్ననా! పని జేత్తు జేత్తు జచ్చిపోయింది మారాజు' అని ఎవలకు తోచినట్టు వాళ్ళు అన్నరు.

నారిగాని బతుకు మళ్ళా మొదటికే పోయింది. తాళ్ళెక్కి ఊళ్ళెకు పొద్దుగాల్నే రావాలని ఎంతజేసినా కాలేదు. పొద్దుగాల లెవ్వాలాయె- కుండలు కడుక్కొని యింత ఉడికేసుకోవాలాయె. యివన్నీ జేసేయాల్లకే పొద్దుపోతుంది. ఇగ తెచ్చిన కల్లు ఎంత రాత్రైనా అమ్ముడువోతనే లేదు. అమ్ముడు యవ్వారం నారిగాని సేతి కబ్బలేదు. అదీగాక ఇదివరకు నారిగాడెన్నడూ కల్లు అమ్మకనే పాయె. ఇప్పుడు రోజు పాసికల్లు మిగులుతుంది. గాకల్లునే కొత్తదాన్ల కలుపుతుండు. తాగేటోళ్ళు కూడా నారిగాని యింటికి ముంటోలె వస్తలేరు. అదేందే అంటరు. నూతిలో పడ్డానిమీదే నూరు రాల్లన్నట్లయింది నారిగాని బతుకు.

కొన్ని దినాలు గడిసినయి. ఆనిలో ముందటోలె చురుకుదనం లేదు. మందకోడోలె తాళ్లకు వోతడు. వస్తడు, ఎవలన్నా కల్లుకోసం వస్తె అమ్మతడు. తాగెటొల్లకేమో పంచుతడు యిదంతా చూచి నారిగాని అన్నలు లోపల్లోపల మురిసిపోయింండ్రు. కాని గౌండ్లోల్లంతా కలిసి నారిగానికీ మల్ల లగ్గం జేస్తె ముందట పడుతడని అనుకున్నరు. బస్ అనుకున్న పదిరోజులకే కుంటీ, గుడ్డీ, చెవిటి గాని ఒకదాన్ని తెచ్చి నారిగానికి మార్వనం జేసింద్రు. ఎనుక పడుతున్న నారిగాని బతుకు కొత్త పెండ్లాంతో ఎల్లితో మెరుగున పడ్డది. మల్లా మునుపటోలనే నారిగాడు తాళ్ళకు వోతుండు. కల్లు అమ్ముతుండు. ఆడు కడుపునిండా తింటుండు. నిద్రవోతుండు.

నారిగానికి గిప్పుడిప్పుడే మనసుల అంత ఎట్లనో అనిపియ్యవట్టింది. ఆడేందో ఒక్కొక్కనికి వద్దనంగా ఉసిల్లపుట్టోలె పోరగాండ్లు పుడుతనే వుంటరు. కాని నారిగాడు మొక్కరాని దేవుండ్లకల్లా మొక్కుకున్నడు. కనపడ్డ సన్యాసితోని, కల్లువోసి, అదీదిచేసి మంచిగజేసుకొని తాయితులు కట్టించుకున్నరు. బయిండ్లోన్ని పిలిచి మీద ఏందో ఉందంటే నాలుగైదుసార్లు తీయించేసిండు. ఎంత చేసినా ఎల్లి కడుపుల యింత పిందె పడకపాయె. పాపం నారిగానికి ఏ చింతాలేదు. ఉండటానికి ఓ చతురసాల బవంతి కట్టించుకున్నడు. చచ్చిపోయినాంక అవుతల పారెయ్యడానికి పోరడు ఉంటే ఎంత మంచిగుగండు... నారిగాడు రోజులన్నీ ఇగ కొడుకు పుడుతడనే పనిజేస్తుండు. తింటుండు, పంటుండు కాని ఎల్లిసప్పుడు జెయ్యక ఊర్కోలేదు. ఇక నాకెట్లయినా పిల్లలు పుట్టరు. ఇంకో దాన్ని తెచ్చుకొమ్మని బతిమిలాడింది. కాని నారిగానికి అది మంచిగ అనిపియ్యలే. ఇదువరకే ఇది రెండవ పెళ్లాం. ఇంకోదాన్ని తెచ్చుకుంటే మూడవది. ఛీ... ఛీ.... పెయ్యంతా జెర్రులు వాకినట్లయింది. ఇక ఎన్నడూ కలలగూడ ఈ మాట అనుకోవద్దను కున్నడు నారిగాడు. అయిన గిప్పుడే ఏమైంది. దీన్ని తెచ్చుకొని మూడేండ్లన్నా కాకపోయే. ఇంకా చూద్దాం. అనుకుని మనసును తాత్పర్యం చేసుకున్నడు.

నారిగాడు పొద్దటిపొంటె పొయ్యచ్చిండు. ఎల్లి కల్లు బాగానే అమ్ముతుంది. ఆనాడు నారిగానికి పడుకుంటే నిద్రపట్టలే? ఎల్లి కల్లు ఎట్ల అమ్ముతదో సహాసుకుంట సూద్దామని వన్నోడుచేచి మంచముల్నే కూసున్నడు. ఎల్లి వచ్చినోనికల్లా మంచిమాటలు చెప్పి అక్కన్నే తాగినోని కల్లా

## హైకూలు

గడ్డిపై మంచు
శ్వేత వర్ణం దాల్చింది
వెలుతురులో...

నెమరేసింది
గత స్మృతులను
ఉత్తరమేనా!

ఎరుపెక్కింది
ప్రియ సఖుని చూసి
కన్నె బుగ్గేనా?

ఒకటే గోల
సరుకుల సమరం
మా ఊరి సంత

పిల్లల గోల
మాష్టారు రాకతోనా
బడిలో కర్ఫ్యూ

నూతిలో కప్ప
ఇంటిలో టీవీ బాక్సు
అదే లోకమా!

నీటిలో మీనం
కన్నుపడితే వేట
కింగ్ ఫిషర్

అరుదైనది
అంతరించిపోయింది
మానవ స్వార్థంలో

తప్పట్ల జోరు
పొగడ్తల హోరులో
సాహితీవేత్త.

–గాదిరాజు రంగరాజు

ఆకుమీద కల్లును అంచుతుంది. ఇంటికి కొనుక్కపోయేటోల్లట్లకు బింకుల పోసియిత్తుంది. ఇంటికి తెమ్మనోల్లకేమో వక్క మొకాన పెటుకుంటుంది. నారిగానికి అక్కడ కూసుంటే మనసున పట్టలే. అందుల ఎల్లి అక్కడ కూసున్నల్లకే నవ్వుకుంట, తుల్లుకుంట, ఇంక ఏందేందో చేసుకుంట కల్లు అంచుతుంది. ఛీ... ఛీ... ఏందేందో అనుకున్నడు. అట్ల ఎన్నడూ అనుకోని నారిగాడు ఎట్లెట్టనో అయిపోయిండు పావుగంటల.. గాపావు గంటల్నే మొదటి పెండ్లాం లసుమ యాదికచ్చింది. లసుమ బతికివున్నప్పుడు ఎవలు ఏమన్లేదు. కాని అది చచ్చిపోయినాంక దాని మీద బాగా పుకార్లు పుట్టినయి. నారిగాడు అవన్నీ గాలి మాటలే అనుకున్నడు. కాని లసిమి గట్టాంటిది కాదని ఎందుకు అనుకోవాలె? నారిగాడు అడుక్కున్నడు తనకు తానే! ఛీ....ఛీ.... గంత మంచిదానిమీద అట్లాంటి మాటలా అని చెడామడా చెంపలేసుకున్నడు. యిగ యిట్లకూసుని పిసోనోలె యిసారం చేయద్దనుకొని జెప్పుజెప్పలేచి ఊళ్ళె మొకాన వోయిండు.

నారిగాడు గౌండ్లిల్ల పెద్దమనిషి అయిండు. కిస్తీలు దగ్గరికి రాంగనే రకమంతా వసూలు చేసి ముస్తాజరుకు తనే యిచ్చి వస్తడు. ఇట్ల బాగా రోజుల్నించి నడుస్తుంది. ఆనాడు కిస్తీపైకమంతా తీసకువచ్చి యింట్ల వెట్టిండు పొద్దుగాల యిచ్చివత్తామని. గంతెల్లమే గట్ల అయితదని ఎవలన్నా కలగంటారా? అయింత ఆరాత్రే ఎల్లి ఆ రకమంతా తీసుకొని యింట్లకెల్లి ఎల్లిపోయింది. నారిగాడు లబాలిబా మొత్తుకున్నడు. దాని తల్లిగారింటి మొకాన ఉరికిండు. ఆడ ఎవలున్నరు. ఉన్న ఒక్క ముసల్ది కడుపంతా కొట్టుకుంది. నా బిడ్డను వాగుపాలు చేసినవని, నారిగానికి యిగేం చేయాల్నో తొయ్యలేదు. పిచ్చోనోలె వారం రోజులు చెట్టనక, పుట్టనక తిరిగిండు. ఇంటికి వచ్చినాంక తెలిసింది ఆనికి. ఎల్లి ఆ ఊళ్లోడే అయిన కమ్మరి బాలిగానితో లేసిపోయిందని.

అయింత ఎట్లెట్టనో జేసి రకమంతా గట్టిండు. నారిగాని బతుకు మల్లా ఎప్పటోలనే అయింది. ఇగ ముంటోలె మల్లా లగ్గం జేత్తమని ఊళ్లోలు ఎవరూ ముందుకు రాలె. కాని గిట్లా ఒక్కడే బతకడం నారిగానికి కష్టమైంది ఎట్లయినా జేసి మళ్ళా మార్వానం చేసుకుంటేనే మంచిది అనుకున్నడు. ఈసారి ఎవలపొత్తు పెట్టుకోకుండానే నారిగాడు పక్కఊరికి వోయి మొగడు చచ్చిపోయిన ముండరాల్ని మార్వానం జేసుకున్నడు.

ఇప్పుడు నారిగాడి బతుకు మూడో పెండ్లాంతో గడుత్తుంది. మల్లా నారిగాడు ముందటోలెనే పన్లూ జేసుకుంటుండు. పెండ్లాం కల్లు అమ్ముతుంటుంది.

నారిగాగోని మూడో పెళ్లాం వయసులో ఉంది. నారిగానికేమో అప్పటికప్పుడే ఎంట్రుకలు నరుసుత్తున్నాయి. దీన్ని తెచ్చుకున్నాంక యాడదిన్నర్థముల్నే కొడుకు పుట్టిండు. ఇగ నారిగాని సంతోషాన్కి పట్టవగ్గాల్లేకుండా పోయింది.

ఆనాడు మూడో పెండ్లాం కల్లు అంచుతుంది. నారిగాడేమో నిద్రరాకపోతే మంచంల కూసోని కొడుకుని ఆడిస్తుండు. ఇంతట్లోనే కల్లు అంచుతున్న కాన్నుంచి పెండ్లాం మొత్తుకుంటున్నట్టు విని ఉరికిండు. కల్లు అంచుతుండగా దాన్ని కొంగుపట్టి గుంజినోన్ని నాలుగైదు తన్నిండు. ఛీ... ఛీ. యెదవబుద్ధి అని తిట్టిండు. యిగ ఆన్నుంచి నారిగాడే కల్లు అమ్ముడు మొదలు పెట్టిండు. అదేమో యింట్ల పన్లు జూసుకునేది. ఊళ్ళె కొయ్యి గొబ్బలు పట్టుకచ్చేది అంతే!

ఇగ అప్పట్నించి నారిగాని కొడుకు ఎట్లెట్ట పెద్ద వెరిగిండో - అట్లట్ల అని మూల ద్రవ్యం తరుగుడు వెట్టింది. కల్లు అమ్ముడు రోజురోజుకు తగ్గిపోయింది. ఇరువై తాళ్ళకెల్లి ఆఖరికి మూడు చిక్కినయి కొడుకు చేతికచ్చేవరకు. నారిగాడు తన కొడుకును తనోలె గాకుండా చూడాలని చాలా జేసిండు. మూడు తాళ్ళున్నా నిజాయితీగా బతుకుమన్నడు - కల్లును ఆడోళ్ళు అమ్మద్దన్నాడు. కాని కొడుకు యినలే! ఈ ముసలోని మాట యిని గిట్ల కూటికి ఎవలు జత్తరు. కల్లమ్మెటోల్లంతా గట్లనే ఉంటరా! అని కొడుకు సవాల్ - ముసలోడైండు నారిగాడు - ఏం జేత్తడు, యాల్లకు యింత పడేస్తే తింటడు. ఓ మూలకు పంటడు. అంతే నారిగాని బతుకు. ■